# ఆత్మబంధువు

ఇంటిబయట తోటలో కూర్చుంటే
నీ వొళ్ళో ఒద్దికగా అమరి కూర్చుంటుంది.
పనులతో అలసి సొలసి పడకగదిలో
నడుమువాల్చి కళ్ళు మూసుకుంటే
నీ గుండెలమీద నిశ్చింతగా
విశ్రాంతిగా  అదీ వాలిపోతుంది.
చదువులగదిలో నిట్టనిలువుగా కూర్చుని
ధ్యానముద్రలో నువ్వుచదువుతుంటే
నీ జ్ఞానసముపార్జనలో భాగస్వామి తానే!

నీనిరంతర పరిశ్రమలో సదా వెన్నంటి వుండే నెచ్చెలి, సఖి!
నిన్ను కవ్విస్తుంది, నీ మనస్సుని మెలిపెడుతుంది,
నీ తెలివిని సవాలు చేస్తుంది
నిత్యమై సత్యమై నీ మేధాసముద్రపు
గాఢతని, నీ ఆలోచనావిహంగాల ఎత్తులని
కొలిచేందుకు, నీకు కొలమానాల్ని ప్రసాదిస్తుంది!

నీలాకాశమంత విశాలమై
బంగాళాఖాతమంత గాఢమై
ఈరెంటినీకలిపుతూ నీ మేధస్సరిహద్దులని
విస్తారింపజేసే ఈ నెచ్చెలిఎవరు?

నేటి కంప్యూటర్ల సినిమాల
టీవీలతెరలకీ సరితూగని
సాటి రాని అచ్చమైన సత్యమైన నేస్తం
పురాణకాలమంత పురాతనమై
నిత్యనూతనమైన నీ అచ్చుపుస్తకం!

- కల్లూరి శ్యామల